క్లుప్తంగా

ఆధార్ కేంద్రం పరిశీలన



ప్రిన్సిపాల్ పద్మలతకు సూచనలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ గిరిబాల బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులందరికీ ఆధార్ నమోదు, ఆధార్‌లో సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మలత పాల్గొన్నారు.

వాసవీ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా తవ్వా



నియామకపత్రాన్ని చూపిస్తున్న తవ్వా మోహనరావు

విజయనగరం: వాసవీ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ నార్త్ జోనల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తవ్వా మోహనరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, తనకు అవకాశం కల్పించిన వాసవీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దేశు వెంకటసుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలతో ఫౌండేషన్‌ను బలోపేతం చేస్తానని చెప్పారు. పేదలు, విద్యార్థులకు మేలు చేసేలా సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు.

218 మందికి ఉద్యోగాలు



ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా ఇన్ఫోసిస్ కంపెనీ నిర్వహిస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 218 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏడాదికి రూ. 2.2 లక్షల వేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎస్.సుగుణ రెడ్డి, ప్లేస్‌మెంట్ టీమ్ అభినందించారు.

రూ.16 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: మండలంలోని 70 గ్రామాల్లో ఇంటింట తాగునీటి కుళాయిల ఏర్పాటుకు రూ.16 కోట్లు మంజూరయ్యాని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అతిథులుగా హాజరయ్యారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలో ఇప్పటికే 50 గ్రామాల్లో మొదటి దశలో రూ.7 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణం, బోర్ల తవ్వకాలు, ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులు జరుగుతున్నాయని చెప్పారు. రూ.16 కోట్లతో రెండో దశ పనులకు ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అలాగే 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 9 సచివాలయాల పరిధిలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని, పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే సోంపురం -ఆనందపురం రోడ్డు విస్తరణకు సంబంధించి వేపాడ, సోంపురం, అరిగిపాలెం గ్రామాల్లో ఇళ్ల తొలగింపు, తదితర అంశాలపై ఆయా గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కృష్ణంరాజును ఆదేశించారు. హౌసింగ్ డీఈ శ్రీనివాసన్ మాట్లాడుతూ మండలంలో 967 ఇళ్లకు 598 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని ఉగాది నాటికి పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులను కోరారు. రెవెన్యూ సమస్యలను సంబంధిత సిబ్బంది సకాలంలో పరిష్కరించకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని చినగుడిపాల, వావిలపాడు సర్పంచ్‌లు రామునాయుడు, రాజేశ్వరి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, నెడ్ క్యాప్ డైరెక్టర్ సీహెచ్ పద్మావతి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ పట్నాయక్, ఏఓ యశ్వంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించే బాధ్యత మీదే..

- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేసి క్రియాశీలక పాత్ర పోషించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం స్థానిక సుజాత కన్వెన్షన్ హాల్‌లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ ఇచ్చారు. ముందుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ఎన్నికలలో ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. 2014లో ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించిన చంద్రబాబు అనంతర కాలంలో హామీలను గాలికి వదిలేసి ప్రజలకు అనేక కష్టాలకు గురిచేశారని ఆరోపించారు. దాని ఫలితంగానే 2019లో తెలుగుదేశం పార్టీని ప్రజలు ఇంటికి సాగనంపారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయానికే అవ్వాతాతలకు పింఛన్ అందించడంతో పాటు అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతు రుణ మాఫీ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అవినీతి రహిత పాలన అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో నిరంతర పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, తండ్రి ఆశయాలకు తగ్గట్టుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనను అందిస్తున్నారని చెప్పారు. మడమ తిప్పని, మాట తప్పని నేతగా అందరిచే ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా మరోసారి జగన్ మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు, ఫ్లోర్ లీడర్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్‌వీవీ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్‌లు ఈశ్వర్‌కౌశిక్, ఎస్.బంగారునాయుడు, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ కనకల సుజాత, సేవాదళ్ అధ్యక్షుడు బాల బ్రహ్మారెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ట్రస్ట్ బోర్డు మెంబర్లు, డివిజన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..



అగ్నిప్రమాద బాధితులకు బియ్యం, దుస్తులు అందజేస్తున్న అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కనిమెట్టలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను బుధవారం పరామర్శించారు. ఒక్కో బాధితుడికి 50 కిలోల బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, శాంతాటి శ్రీను, పల్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం రూరల్: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మండలంలోని చెల్లూరు సమీపంలో ఉన్న లెప్రసీ మిషన్ ఒకేషనల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆమె లాంఛనంగా ప్రారంభించి, క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు బుద్ధి వికాసానికి కూడా దోహదపడతాయన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తిని కలిగి ఉండాలని సూచించారు. గెలుపే ప్రాధాన్యం కాకుండా క్రీడల్లో పాల్గొనడమే మంచి అవకాశంగా భావించాలన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించి నగర ఖ్యాతిని ఇనుమడింప జేయాలన్నారు. జిల్లాకు చెందిన కోడి రామ్మూర్తి, భగవాన్‌దాస్ లాంటి ఎంతో మంది మహనీయులు క్రీడల ద్వారా పేరుగాంచారని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి సంస్థకు, కళాశాల యాజమాన్యానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వికలాంగ సంక్షేమ శాఖ ఎ.డి వీవీ జగదీష్, కళాశాల ప్రిన్సిపాల్ హెన్నా దినకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.8.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

విజయనగరం: నగరంలోని వివిధ డివిజన్‌లలో రూ. 80.20 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. 23వ డివిజన్‌లోని బొండాడవీధి, 43వ డివిజన్‌లోని పాల్‌నగర్‌లో, 49, 50వ డివిజన్‌లోని గాజులరేగ ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, నగరంలో అన్ని ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవ చూపుతున్న విషయం తెలిసిందేనన్నారు. 80.20 లక్షల రూపాయలతో వివిధ డివిజన్‌లలో రహదారి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. వార్డు పర్యటనలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించేలా కోలగట్ల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, కార్పొరేషన్‌కు సమాంతరంగా నగరంలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. 43వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేధారిశెట్టి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

డెంకాషావలి బాబా ఆరాధనోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న దర్గా వారసుడు షేక్ షాజహాన్

విజయనగరం టౌన్: హిందూ, ముస్లిం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన డెంకేషావలీ బాబా ఆరాధన ఉత్సవాలు ఖురాన్ పఠనంతో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయని దర్గా వారసుడు షేక్ షాజహాన్ తెలిపారు. కోట జంక్షన్ వద్దనున్న బాబా ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ ఉత్సవాల్లో పాల్గొని బాబా తీర్థ,ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. మూడురోజుల పాటూ నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో షేక్ మహమ్మద్ సిద్ధిక్ చిష్టి, నాజర్ షరీఫ్, మహమ్మద్ మునిరుద్దీన్, షేక్ మహమ్మద్ షుకూర్, సయ్యద్ ఇబ్రహీం, మహమ్మద్ నియమతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



వినతిపత్రం అందుకుంటున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: కొత్తవలస మండల కేంద్రంలోని బాలికల వసతిగృహంలో కలుషిత ఆహారం తిగనడంతో 24 మంది విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరు సంఘ సభ్యులు డీఆర్‌ఓ ఎం.గణపతిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం రాత్రి వండిన ఆహారాన్ని మంగళవారం పులిహోర చేసి విద్యార్థినులకు ఇవ్వడం వల్ల 24 మంది ఆస్పత్రి పాలయ్యారని సంఘ సభ్యులు డీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. వీరిలో 13 మంది కోలుకోగా మరో 11 మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఇలాంటి పరిస్థితికి కారకులైన హాస్టల్ వార్డెన్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సునీల్, ఎన్.నాగభూషణం, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయండి

- డీఎంఈ వినోద్‌కుమార్




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్స్‌తో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అదేవిధంగా రోగులకు సకాలంలో నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవలను పెంచడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సుమనోహరంగా రాములోరి గుడి..

నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం కొండపై కోదండ రాముడి గుడి నిర్మాణం సుమనోహరంగా సాగుతోంది. గుడికి వెళ్లేందుకు మెట్లతో పాటు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కొండమీద అలనాటి రామాలయం



నేడు సుందరంగా తీర్చిదిద్దుతున్న ఆలయం

ఎమ్మెల్సీ పరామర్శ



అప్పయ్యమ్మకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్నిప్రమాద బాధితురాలిని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు బుధవారం పరామర్శించారు. గ్రామానికి వెళ్లి బాధితులతో కాసేపు మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధురాలైన ముంత అప్పయ్యమ్మకు ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. అలాగే సర్పంచ్ మక్కువ తవుడమ్మ ఒక రైస్ బ్యాగ్, నిత్యావసరాలు, వెయ్యి రూపాయల నగదు అందజేశారు. మరో నాయకుడు మక్కువ రమణ మూడు నేత చీరలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నాయకులు మక్కువ వెంకటరమణ, చిన సత్యం, యడ్ల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు రవాణా చేస్తే కఠినచర్యలు

- విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: రైళ్లల్లో నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు ప్రయాణికులను హెచ్చరించారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న వస్తువులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే ఎస్పీ విశాల్ గున్ని ఆదేశాల మేరకు విజయనగరం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు. నిషేధిత గంజాయి, కొకైన్, హెరాయిన్‌తో పాటు ఖైనీ, గుట్కా రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. రైళ్లల్లోనూ తమ సిబ్బంది నిఘా పెట్టారన్నారు. ప్రయాణికులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అపరిచితులు ఇచ్చిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎస్.సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వివరించేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటను, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం ఈమూడున్నరేళ్ల పాలనలోనే సీఎం జగన్ అమలు చేసి చూపించారన్నా రు. గత టీడీపీ ప్రభుత్వం, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు ఒకసారి బేరీజు వేసుకోవాలని కోరారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా పథకాలు, ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. టీడీపీ హయాంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం ఆ పార్టీ సానుభూతి పరులకు, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చే వారికే అందేవని గుర్తుచేశారు. రైతులు విత్తనాలు,ఎరువుల కోసం మండల కేంద్రాల్లో వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద నడిరోడ్డుపై మండుటెండల్లో పడరాని పాట్లు పడేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, సాగు సంబంధిత సేవలన్నీ అందుతున్నాయని వివరించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి కుమారుడు లోకేష్ చేస్తున్న పాదయాత్రను ప్రజలు పట్టించుకోవడంలేదని అన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి సంబంధించిన కిట్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, గజపతినగరం మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకుడు పప్పల గురినాయుడు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం సాధిద్దాం

గజపతినగరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయం సాధించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు అంతా సమన్వయంతో పని చేద్దామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ మండల కన్వీనర్‌లు,ఎంపీటీసీలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించాలని సూచించారు.